'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

రాజ్య సంస్కరణ

TGBIL/26/A6717 RAJYA SAMSKARANA తెలుగు దినపత్రిక

www.rajyasamskarana.com

'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 1 | సంచిక : 50 | ఆదివారం | 4.10.2026 | పేజీలు : 8 | వెల రూ. 2

Medchal Malkajgiri | Volume: 1 | Issue: 50 | Sunday | 4.10.2026 | Pages: 8 | Rate: 2



మోడీ సర్కారు మెడకు ఉచ్చు

లోక్‌సభ, అసెంబ్లీల రద్దుకు కాంగ్రెస్ డిమాండ్

నిరసనలతో దేశమంతటా రీసౌండ్

7లో..

ఎన్నికల చుట్టూ మంటలు.. ఓటు చుట్టూ రగడ.. ఈసీపై ప్రశ్నలు.. న్యాయస్థానాల్లో విచారణలు.. దేశవ్యాప్తంగా నిరసనలకు పిలుపులు.. ఇలా ఒక్కో పరిణామం రాజకీయ వేడిని మరింత పెంచుతోంది. కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఎన్నికల వ్యవస్థపైనే సంచలన ఆరోపణలు చేస్తూ.. లోక్‌సభ, అసెంబ్లీలను రద్దు చేసి కొత్తగా ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈవీఎంలకు బదులు బ్యాలెట్ పేపర్లతో పోలింగ్ జరపాలని పట్టుబడుతున్నారు. మరోవైపు ఓటర్ల జాబితాల సవరణ కోసం చేపట్టిన సర్ ప్రక్రియపై సందేహాలు ముసురుకుంటున్నాయి. ఎవరి ఓట్లు తొలగుతున్నాయి..? ఎందుకు తొలగుతున్నాయి..? జాబితా నుంచి పేరు మాయమైతే అర్హుడైన ఓటరు తిరిగి తన హక్కును ఎలా పొందాలి..? అన్న ప్రశ్నలు రాజకీయ రణరంగాన్ని మరింత వేడెక్కిస్తున్నాయి. ఇదే సమయంలో ఈసీ పనితీరు.. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ వ్యవహారశైలిపై వచ్చిన ప్రశ్నలు న్యాయస్థానాల గడప దాటాయి. ఒకవైపు అక్టోబర్ 6న ప్రతిపక్షాల మార్చ్.. మరోవైపు అక్టోబర్ 10న సీఈసీ రాజీనామా డిమాండ్‌తో సీజేపీ జంతర్ మంతర్ సమరం.. ఎన్నికల వ్యవస్థపై చర్చను దేశవ్యాప్త అంశంగా మారుస్తున్నాయి. ఆరోపణలు ఎక్కడి వరకు నిజం..? సర్ అసలు వివాదం ఏమిటి..? ఈసీపై ప్రశ్నలు ఎందుకు పెరుగుతున్నాయి..? అక్టోబర్ 6, 10న ఏం జరగబోతోంది..? చివరికి ప్రజల ఓటు.. ప్రజాస్వామ్యంపై నమ్మకం ఈ పోరాటంలో ఎటు నిలుస్తాయి..?



2లో..



ఓటర్ల జాబితాపై ప్రకాశ్‌రాజ్ ఫైర్

ఎస్ఐఆర్‌పై తీవ్ర అభ్యంతరాలు

హైదరాబాద్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై నటుడు ప్రకాశ్‌రాజ్ తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

ప్రకాశ్ రాజ్‌కు బీజేపీ సెగ

మీడియా మీట్ బయటే పాగ

ప్రకాశ్ రాజ్ మీడియా సమావేశం నిర్వహించిన ప్రాంతం బయట బీజేపీ కార్యకర్తల నిరసనతో ఉద్రిక్తత నెలకొంది. చేతుల్లో ప్లకార్డులు.. నోట్లో నినాదాలు.. "గో బ్యాక్ ప్రకాశ్ రాజ్" అంటూ కార్యకర్తలు హోరెత్తించారు.



ప్రదర్శన పడకగది వరకే ఇష్టానుసారం పది మందిలోకి వెళితే వస్త్రం.. గౌరవం

వివరాలు 5లో..

మోడ్రన్ జీవితం మారింది.. దుస్తులు మారాయి.. ఆలోచనలు మారాయి.. సోషల్ మీడియా మన వ్యక్తిగత జీవితాన్నే బహిరంగ వేదికగా మార్చేసింది. కానీ ఒక ప్రశ్న మాత్రం ఇంకా నిలిచే ఉంది. స్వేచ్ఛకు హద్దు ఎక్కడ? గోప్యతకు విలువ ఎంత? దాంపత్యంలో ఆధునికతకు అర్థమేంటి? భార్యాభర్తల మధ్య ఆకర్షణ సహజం. శృంగారం సహజం. ఒకరి కోసం మరొకరు అలంకరించుకోవడం సహజం. కానీ పడకగదిలోని ఆత్మీయతను ప్రతి సందర్భంలోనూ ప్రపంచం ముందు ప్రదర్శించాల్సిన అవసరం ఉందా? ఒకసారి ధరించిన వస్త్రాన్ని ఆధారంగా చేసుకొని వ్యక్తిత్వం ఎలాంటిదో చెప్పడం ఎంత తప్పో.. కుటుంబ గౌరవం పేరుతో వ్యక్తిగత స్వేచ్ఛను అణచివేయడం కూడా అంతే తప్పు. అసలు సమస్య దుస్తుల్లో లేదు.. సందర్భాన్ని అర్థం చేసుకోవడంలో ఉంది. సమస్య శృంగారంలో లేదు.. దానికి ఇచ్చే స్థానం, పరిమితి, పరస్పర సమ్మతిలో ఉంది. సోషల్ మీడియా యుగంలో వ్యక్తిగత ఫోటోలు, వీడియోలు బయటకు వెళ్లిన తర్వాత తిరిగి తీసుకురావడం సాధ్యం కాదు. మరి ఆధునిక దాంపత్యంలో నిజమైన సంస్కారం ఏది? ప్రపంచానికి చూపించాల్సింది వ్యక్తిత్వమా.. లేక జీవిత భాగస్వామి కోసం దాచుకోవాల్సింది ఆత్మీయతా? స్వేచ్ఛ, శృంగారం, గౌరవం, గోప్యత మధ్య అసలు గీత ఎక్కడుందో తెలుసుకోవాలంటే.. పూర్తి కథనం చదవాల్సిందే.

విద్యా, వైద్యంపై సీఎం ఫోకస్

•ఆసుపత్రులు, స్కూళ్లపై నజర్ • నిర్మాణాలు సరే, సేవలు ముఖ్యం

రాష్ట్రంలో విద్య, వైద్య రంగాల క్షేత్రస్థాయి పరిస్థితులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. శనివారం సీఎంవో అధికారులతో నిర్వహించిన సమీక్షలో నిర్మాణంలో ఉన్న ప్రధాన ఆసుపత్రుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఎల్బీనగర్, అల్వాల్, వరంగల్, ఉస్మానియా ఆసుపత్రుల పనుల్లో వేగం పెంచాలని సూచించారు. ఆసుపత్రుల అవసరాలకు అనుగుణంగా వైద్యులు, ఇతర సిబ్బంది నియామక ప్రక్రియను ఇప్పటి నుంచే ప్రారంభించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. ఆసుపత్రుల నిర్మాణం పూర్తయ్యే సమయానికి సిబ్బంది కొరత లేకుండా చూడాలని స్పష్టం చేశారు. అత్యాధునిక వైద్య పరికరాలను ముందుగానే సమకూర్చి, ఆసుపత్రులు అందుబాటులోకి వచ్చే నాటికి అన్ని రకాల వైద్య సేవలు సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. (వివరాలు 2లో..)

పిల్లల ఆన్‌లైన్ భద్రతకు కొత్త కవచం

సైబర్ నేరాలపై సమగ్ర భద్రతా విధానం

పిల్లలను సైబర్ నేరాల నుంచి రక్షించేందుకు సమగ్ర బాలల ఆన్‌లైన్ భద్రతా విధానం రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. హైకోర్టు, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ (టీజీఎస్ఎల్ఎస్ఏ)తో సంప్రదించి ఈ విధానాన్ని సిద్ధం చేయాలని సూచించారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన జాతీయ న్యాయ సేవాధికార సంస్థ దక్షిణ మండల ప్రాంతీయ సదస్సులో సీఎం పాల్గొన్నారు. (వివరాలు 2లో..)





ఇక అన్‌స్టాపబుల్

- **హైదరాబాద్ మొత్తం తిరిగేయండి**
- **అందుబాటులోకి కామన్ పాస్ విధానం**
- **మెట్రో-ఆర్టీసీ అనుసంధానం అమల్లోకి**

హైదరాబాద్ ప్రజా రవాణాను మరింత సులభతరం చేసే లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్ విధానాన్ని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్వయంగా పరిశీలించారు. బేగంపేట మెట్రో స్టేషన్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, అజారుద్దీన్, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, అధికారులతో కలిసి మెట్రోలో ప్రయాణించారు. (వివరాలు 2లో..)

రేవంత్ కుటుంబ వ్యాపారాలపై బీఆర్ఎస్ ఆరోపణలు

- **కేంద్ర దర్యాప్తు సంస్థలతోపాటు, పార్టీలకు లేఖలు**
- **విచారణకు ఆధారాలు ఇచ్చామన్న పార్టీ నేతలు**





తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుటుంబానికి సంబంధించినవిగా పేర్కొంటున్న వ్యాపారాలు, ఆర్థిక లావాదేవీలపై సమగ్ర విచారణ జరిపించాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. మెడికవర్ ఆసుపత్రి, మ్యాక్స్‌బియన్ ఫార్మా, మైండ్‌వాల్ట్ నిర్మాణ సంస్థ, కార్పొరేట్ పాఠశాలల వ్యవహారాలపై దర్యాప్తు అవసరమని పేర్కొంది. ఈ అంశాలకు సంబంధించిన పత్రాలు, ఆధారాలను జతచేసి కేంద్ర దర్యాప్తు సంస్థలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులకు లేఖలు పంపినట్లు పార్టీ తెలిపింది. (వివరాలు 2లో..)



ట్యాంక్‌బండ్‌పై బతుకమ్మ సంబురం

18న సద్దుల బతుకమ్మ వైభవం

తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పూల పండగను ఈనెల 10 నుంచి 18వ తేదీ వరకు ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. సచివాలయంలో శనివారం సీఎస్ సంజయ్ జాజు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా 18న సద్దుల బతుకమ్మను ట్యాంక్‌బండ్‌పై వేలాది మంది మహిళలతో వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం 4 గంటలకు అమరవీరుల స్మారక కేంద్రం నుంచి మహిళలు బతుకమ్మలతో ఊరేగింపుగా ట్యాంక్‌బండ్‌కు చేరుకోనున్నారు. వందలాది మంది కళాకారులు కూడా తమ కళారూపాలతో ర్యాలీలో పాల్గొంటారు. ప్రత్యేక వేదికపై జరిగే వేడుకలకు ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు. (వివరాలు 2లో..)

22-ఎ భూములకు రిజిస్ట్రేషన్ దారి

నాలా రుసుముతో చిక్కులు తొలగింపు

దశాబ్దాలుగా భూ యజమానులను వేధిస్తున్న 22ఎ సమస్యల పరిష్కారంలో తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. వ్యవసాయ భూములుగా పట్టాలు ఉండి, తర్వాత నివాస వినియోగంలోకి వచ్చినా నాలా ప్రక్రియ పూర్తికాక రిజిస్ట్రేషన్లు నిలిచిపోయిన భూములకు ఇప్పుడు మార్గం సుగమమైంది. అర్హత ఉన్న భూములకు నాలా రుసుముతో పాటు అవసరమైన ప్రభుత్వ రుసుములు వసూలు చేసి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లకు ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది. మెమో నంబర్ 48062/ULC/A1/2026 ద్వారా ఈ ఆదేశాలు ఇచ్చినట్లు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. (వివరాలు 2లో..)





జాతకంత్రి

పరాకాష్టకు చేరిన పైత్యం..

వేణుస్వామి "నగ్న" సత్యం

• సన్నీ లియోన్‌తో పోలిక.. • ఊడదీసేందుకు ఏమి లేదిక..



టైం మెషీన్ మాయావి

సింగీతం శ్రీనివాసరావు ఇకలేరు



ఒక దర్శకుడు సినిమా తీస్తాడు.. మరో దర్శకుడు సినిమాకే కొత్త ఊపును నేర్పిస్తాడు. సింగీతం శ్రీనివాసరావు ఆ రెండో కోవకు చెందిన మాయావి. తెరపైకాలాన్ని వెనక్కి తిప్పి 'ఆదిత్య 369'లో భవిష్యత్తును చూపించిన సృజనశీలి.. మాటలు లేకుండానే 'పుష్పక విమానం'తో కథ చెప్పిన ప్రయోగశీలి.. జానపదాన్ని, హాస్యాన్ని, విజ్ఞాన కల్పనను తనదైన శైలిలో మలిచిన అరుదైన దర్శకుడు. తెలుగు సినిమా ఊహలకు రెక్కలు తొడిగిన ఆ మహా మాంత్రికుడు ఇక లేరు. (3లో..)

లక్షకు ఐదు తులాల మాయ

మణికొండలో ఘరానా మోసం



లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు రద్దు చేయాలి

దేశ వ్యాప్తంగా బ్యాలెట్‌తో ఎన్నికల జరపాలి

మళ్లీ ఎన్నికలు పెట్టాలన్న ఏఐసీసీ చీఫ్ ఖర్గే

ప్రస్తుతం కొనసాగుతున్న లోక్‌సభ, అన్ని రాష్ట్రాల శాసనసభలను రద్దు చేసి కొత్తగా ఎన్నికలు నిర్వహించాలని కలబుర్గిలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలు పెను దుమారం రేపుతున్నాయి. (3లో..)



ఖర్గే వ్యాఖ్యలపై బీజేపీ ఎదురుదాడి

ప్రజాతీర్పును అవమానించొద్దన్న చౌహాన్

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలను "అక్రమ" నేతలుగా పేర్కొనడంపై కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తీవ్రంగా స్పందించారు. (వివరాలు 3లో..)



ఎన్నికల రగడ.. పోరు షురూ

రాహుల్ 'సత్యాగ్రహం' వేదిక

కాంగ్రెస్ అగ్రనేత, లోక్ సభలో ప్రతిపక్ష నేత.. రాహుల్ గాంధీ 'సత్యాగ్రహం' పేరుతో డిజిటల్ వేదికను ప్రారంభించారు. దేశవ్యాప్తంగా వివిధ సమస్యలపై పోరాడుతున్న ప్రజలు, విద్యార్థులు, రైతులు, గిరిజనులు, దళితులు, మహిళలు తమ ఉద్యమాలను నమోదు చేసుకునేలా ఈ వేదికను రూపొందించినట్లు ఆయన తెలిపారు. ప్రారంభమైన తొమ్మిది గంటల్లోనే 10 వేలకు పైగా స్పందనలు వచ్చాయని రాహుల్ వెల్లడించారు. భూమి, మహిళల హక్కులు, దళితులు, వెనుకబడిన వర్గాలు, విద్య, పరీక్షలకు సంబంధించిన సమస్యలను ఒకే వేదికపైకి తీసుకురావడమే లక్ష్యమని చెప్పారు. ప్రజల సమస్యలను పార్లమెంటులో, వీధుల్లో, లేఖల ద్వారా ప్రస్తావిస్తానని రాహుల్ పేర్కొన్నారు.



పోటీపై ఉత్తమ్ క్లారిటీ

హుజూర్‌నగర్ నుంచే బరిలో తేల్చి చెప్పిన కెప్టెన్

తెలంగాణ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తన రాజకీయ భవిష్యత్తుపై వస్తున్న ఊహాగానాలకు స్పష్టత ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో తాను హుజూర్‌నగర్ నియోజకవర్గం నుంచే పోటీ చేస్తానని తేల్చిచెప్పారు. డీలిమిటేషన్ తర్వాత తుంగతుర్తి నియోజకవర్గానికి మారుతారంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఉత్తమ్ కుమార్ రెడ్డి, నియోజకవర్గం మారుతున్నానే వార్తలను ఎవరూ నమ్మొద్దని కోరారు. తుంగతుర్తి పరిధిలోని తన స్వగ్రామం తాటిపాములలో అభివృద్ధి పనులు జరుగుతున్నంత మాత్రాన అక్కడి నుంచి పోటీ చేస్తానని చెప్పడం అవాస్తవమని స్పష్టం చేశారు.

22-ఎ భూములకు రిజిస్ట్రేషన్ దారి

నాలా రుసుముతో చిక్కులు తొలగింపు



అర్హత పరిశీలన తర్వాతే రిజిస్ట్రేషన్

22ఎ జాబితాలో ఉన్నప్పటికీ నివాస వినియోగంలో ఉన్న పట్టా భూముల దరఖాస్తులను రెవెన్యూ రికార్డులు, భూమి హక్కులు, క్షేత్రస్థాయి పరిస్థితుల ఆధారంగా సమగ్రంగా పరిశీలించాలని కలెక్టర్లను ఆదేశించారు. నిబంధనలకు అనుగుణంగా ఉన్న దరఖాస్తులకు నాలా రుసుము, ఇతర ప్రభుత్వ రుసుములు వసూలు చేసి రిజిస్ట్రేషన్‌కు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా ప్రక్రియను పారదర్శకంగా, కాలపరిమితిలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఏళ్లుగా ప్లాట్లు విక్రయించుకోలేక, వాటిపై రుణాలు పొందలేక ఇబ్బందులు పడుతున్న సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు ఈ నిర్ణయం ఉపశమనం కలిగించనుంది.

అధికారులపై నిరంతర పర్యవేక్షణ

22ఎ సమస్యల పరిష్కారంపై జరిగిన సమీక్షలో మంత్రి పొంగులేటి, తాజా ఉత్తర్వులు క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలయ్యేలా నిరంతరం మానిటరింగ్ చేయాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన దరఖాస్తులను వేగంగా పరిష్కరించి అమలు పురోగతిపై ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని సూచించారు. ప్రజల అవసరాలు, ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను అధికారులు బాధ్యతగా అమలు చేస్తే భూ సమస్యలు త్వరగా పరిష్కారమవుతాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీల అమలులో భాగంగానే ఈ చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.

22-ఎపై వరుసగా ఫాస్ట్‌ట్రాక్ చర్యలు

22ఎకు సంబంధించిన 10 నుంచి 12 రకాల సమస్యలను ఫాస్ట్‌ట్రాక్ విధానంలో పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. శాసనసభలో ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన 24 గంటల్లోనే ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేశారు. అనంతరం జీఓ 118, జీఓ 76కు అనుగుణంగా మెమోలు జారీ చేశారు. 22ఎలో ఉన్నా జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, డీటీసీపీ మున్సిపల్ అనుమతులు కలిగిన ఇళ్లు, ప్లాట్లు, ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు ఇప్పటికే అనుమతి ఇచ్చారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న అర్బన్ ల్యాండ్ సీలింగ్ దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఇప్పుడు నాలా ప్రక్రియ పూర్తికాని పట్టా భూములకు కూడా రిజిస్ట్రేషన్ మార్గం తెరుచుకుంది.



ఇక అన్‌స్టాపబుల్

- హైదరాబాద్ మొత్తం తిరిగేయండి
- అందుబాటులోకి కామన్ పాస్ విధానం
- మెట్రో–ఆర్టీసీ అనుసంధానం అమల్లోకి

హైదరాబాద్ ప్రజా రవాణాను మరింత సులభతరం చేసే లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్ విధానాన్ని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్వయంగా పరిశీలించారు. బేగంపేట మెట్రో స్టేషన్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, అజారుద్దీన్, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, అధికారులతో కలిసి మెట్రోలో ప్రయాణించారు. ఈ సందర్భంగా ప్రయాణికులతో నేరుగా మాట్లాడి కామన్ పాస్ వినియోగం, మెట్రో నుంచి బస్సుకు మారే సమయంలో ఎదురవుతున్న ఇబ్బందులు, ప్రయాణ సౌకర్యంపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఒకే పాస్‌తో రెండు రవాణా సేవలను వినియోగించుకోవడం వల్ల సమయం, శ్రమ ఆదా అవుతోందని ప్రయాణికులు తెలిపారు.

బస్సులోనూ ప్రయాణికుల అభిప్రాయాలు

జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ నుంచి సచివాలయం వరకు భట్టి విక్రమార్క సహచర మంత్రులతో కలిసి టీజీఎస్ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. మెట్రో నుంచి దిగిన తర్వాత గమ్యస్థానానికి చేరుకునేందుకు బస్సు సౌకర్యం అందుబాటులో ఉండటం ప్రయాణాన్ని సులభతరం చేస్తోందని ప్రయాణికులు వివరించారు. మరో టికెట్ తీసుకోవాల్సిన అవసరం లేకపోవడం వల్ల సౌకర్యంగా ఉందన్నారు. కామన్ పాస్ విధానం ద్వారా ప్రజా రవాణాలోని వివిధ మార్గాలను అనుసంధానం చేసి సీమ్‌లెస్ ప్రయాణ అనుభూతి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని భట్టి తెలిపారు. భవిష్యత్తులో ఆటోలు, ఊబర్ వంటి ఇతర రవాణా సేవలను కూడా అనుసంధానించే దిశగా ఆలోచిస్తున్నామని చెప్పారు.

ప్రజా రవాణా బలోపేతమే లక్ష్యం

రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, ఒకే పాస్‌తో మెట్రో, ఆర్టీసీ సేవలు వినియోగించుకునే అవకాశం ఉండటంతో ప్రయాణికులకు సమయం, శ్రమ, ఖర్చు తగ్గుతాయని తెలిపారు. నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యకు ప్రజా రవాణాను బలోపేతం చేయడం ముఖ్యమైన పరిష్కారమని పేర్కొన్నారు. డైలీ పాస్, మంత్లీ పాస్‌తో పాటు కామన్ పాస్‌ను అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. ప్రయాణికుల నుంచి వచ్చే సూచనల ఆధారంగా సేవలను మరింత మెరుగుపరుస్తామని చెప్పారు. కార్యక్రమంలో రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, ఎన్‌వీఎస్ రెడ్డి, మెట్రో ఎండీ సర్వర్‌రాజ్ అహ్మద్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జాతకంత్రి

- పరాకాష్టకు చేరిన పైత్యం..
- వేణుస్వామి "నగ్న" సత్యం
- సన్నీ లియోన్‌తో పోలిక..
- ఊడదీసేందుకు ఏమి లేదిక..

జాతకాలు చెప్పడం.. వివాదాలు రేపడం.. ట్రోల్స్ రావడం.. మళ్లీ వాటిపైనే సంచలన వ్యాఖ్యలు చేయడం.. వేణుస్వామి స్టైల్ ఇదేనంటూ నెటిజన్లు సెటైర్లు పేలుస్తున్నారు. తాజాగా 'చంద్రయాన్' సినిమా ప్రెస్‌మీట్‌లో ఆయన చేసిన కామెంట్లు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. "తెలుగు రాష్ట్రాల్లో 2+2=4 అంటే కుదరదు.. 2+2=5 అనాల్సిందే" అంటూ లెక్కలకే కొత్త జాతకం చెప్పారు. అక్కడితో ఆగకుండా "నేను నీ బట్టలు విప్పొచ్చు..నువ్వు నావి విప్పడానికివీల్లేదు"అంటూ మరో విచిత్రమైన పోలిక తెచ్చారు. దీంతో అసలు సమస్య ఏంటి? దానికి ఈ డైలాగ్‌కు సంబంధం ఏంటి? అని నెటిజన్లు తలలు పట్టుకుంటున్నారు. సాధారణ సమాధానానికి బదులు.. ఓవరాక్షన్ ప్యాకేజీ ఇవ్వడమేంటంటూ కామెంట్లు చేస్తున్నారు.

సన్నీ లియోన్ పోలిక.. ఇదేం జాతకం?

ఇక అసలు పంచ్ మాత్రం తర్వాత పేలింది. "నేను సన్నీ లియోన్ లాంటోడిని.. ఆల్రెడీ అన్నీ ఇప్పేసుకున్నా..ఇక కొత్తగా విప్పడానికి ఏం లేదు" అంటూ వేణుస్వామి చేసిన వ్యాఖ్యలు మరింత వైరల్ అయ్యాయి. తనపై వచ్చే కాంట్రవర్సీలకు సమాధానంగా ఈ పోలికను చెప్పినా.. సోషల్ మీడియాలో మాత్రం ఇదే టాప్ కామెడీ అయిపోయింది. పైగా "కాంట్రవర్సీ చేస్తేనే సోషల్ మీడియాలో పైకి వెళ్తాం" అంటూ తన వ్యూహాన్నీ ఆయనే బయటపెట్టారు. దీంతో జాతకాలు చెప్పే వేణుస్వామి.. ఈసారి తన జాతకాన్ని తానే వైరల్ చేసుకున్నారంటూ నెటిజన్లు సెటైర్లు పేలుస్తున్నారు. లెక్కలు మారాయి.. పోలికలు మారాయి.. డైలాగులు పెరిగాయి.. చివరికి వార్త మాత్రం మళ్లీ వేణుస్వామిదే!

పిల్లల ఆన్‌లైన్ భద్రతకు కొత్త కవచం

సైబర్ నేరాలపై సమగ్ర భద్రతా విధానం



చట్టపరమైన రక్షణతో బాలల భద్రత

భరోసా కేంద్రాలు, బాలల పరిరక్షణ విభాగాలు, బాలల సంక్షేమ కమిటీలు, ప్రత్యేక కోర్టులు, న్యాయ సేవాధికార సంస్థలు సమన్వయంతో పనిచేస్తున్నాయని సీఎం తెలిపారు. సైబర్ ల్యాబ్‌లు, సైబర్ అవగాహన యాప్‌లు, పాఠశాలల్లో న్యాయ హక్కులపై శిక్షణ ద్వారా పిల్లలకు రక్షణ కల్పిస్తున్నామని వివరించారు. ఇప్పటివరకు 3,000 మందికి పైగా బాలల పరిరక్షణ అధికారులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బంధిత కార్మికత్వం నుంచి విముక్తి, న్యాయ సహాయం, రక్షణ, పునరావాసం, పునఃసమీకరణ కోసం టీజీఎస్ఎల్ఎస్ఏ కొత్త పథకాన్ని సీఎం ప్రారంభించారు. న్యాయం అంటే కేవలం నేరస్థుడికి శిక్ష కాదు.. పిల్లలకు గౌరవం, భద్రత, కోల్పోయిన బాల్యాన్ని తిరిగి అందించడం అని పేర్కొన్నారు. ఇంటర్నెట్, కృత్రిమ మేధస్సు ప్రయోజనకరమైనప్పటికీ తప్పుడు సమాచారానికి పిల్లలు గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సదస్సులో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ అలోక్ ఆరాధే, జస్టిస్ ఆర్. మహాదేవన్, జస్టిస్ పి.ఎస్. నరసింహ, కేంద్ర సహాయ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అపరేష్‌కుమార్ సింగ్ పాల్గొన్నారు.

విద్యా, వైద్యంపై సీఎం ఫోకస్

»ఆసుపత్రులు, స్కూళ్లపై నజర్
»నిర్మాణాలు సరే, సేవలు ముఖ్యం



అత్యాధునిక వైద్య పరికరాలను ముందుగానే సమకూర్చి, ఆసుపత్రులు అందుబాటులోకి వచ్చే నాటికి అన్ని రకాల వైద్య సేవలు సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు.

క్షేత్ర పర్యటనలపై స్పష్టమైన ఆదేశాలు

జిల్లా కలెక్టర్లు, అధికారులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలు, సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లు, ఆసుపత్రులను అధికారులు స్వయంగా పరిశీలించాలి అని స్పష్టం చేశారు. ప్రతి జిల్లాలో వీటి పరిస్థితిపై వారానికోసారి సమీక్ష నిర్వహించాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన పాఠశాలల్లో మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ఇదే సమావేశంలో డిసెంబరులో భారత్ ఫ్యూచర్ సిటీలో జరగనున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026 ఏర్పాట్లపైకూడా చర్చించారు. సమ్మిట్ నిర్వహణ, అతిథుల ఏర్పాట్లు, పెట్టుబడుల ఆకర్షణకు పకడ్బందీ ప్రణాళిక రూపొందించాలని సీఎం సూచించారు. త్వరలో ఏర్పాట్లను స్వయంగా పరిశీలిస్తానని తెలిపారు. సమావేశంలో ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు, సీఎస్ సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

రేవంత్ కుటుంబ వ్యాపారాలపై బీఆర్ఎస్ ఆరోపణలు

- కేంద్ర దర్యాప్తు సంస్థలతోపాటు, పార్టీలకు లేఖలు
- విచారణకు ఆధారాలు ఇచ్చామన్న పార్టీ నేతలు



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుటుంబానికి సంబంధించినవిగా పేర్కొంటున్న వ్యాపారాలు, ఆర్థిక లావాదేవీలపై సమగ్ర విచారణ జరిపించాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. మెడికవర్ ఆసుపత్రి, మ్యాక్స్‌బియన్ ఫార్మా, మైండ్‌వాల్ట్ నిర్మాణ సంస్థ, కార్పొరేట్ పాఠశాలల వ్యవహారాలపై దర్యాప్తు అవసరమని పేర్కొంది. ఈ అంశాలకు సంబంధించిన పత్రాలు, ఆధారాలను జతచేసి కేంద్ర దర్యాప్తు సంస్థలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులకు లేఖలు పంపినట్లు పార్టీ తెలిపింది. రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యులతో సంబంధం ఉన్నట్లు తాము ఆరోపిస్తున్న సంస్థల యాజమాన్య నిర్మాణం, వాటాలు, పెట్టుబడులు, ఆర్థిక లావాదేవీలను పరిశీలించాలని కోరింది.

రూ.13,200 కోట్ల వ్యవహారంపైనా ప్రశ్నలు

మెడికవర్ ఆసుపత్రికి సంబంధించిన లావాదేవీల్లో రూ.13,200 కోట్ల అంశంపై కూడా దర్యాప్తు చేయాలని బీఆర్ఎస్ కోరింది. ముఖ్యమంత్రి కుటుంబ సభ్యుల వ్యాపారాలతో సంబంధం ఉందని ఆరోపిస్తున్న వ్యక్తులు, సంస్థల మధ్య నిధుల కదలికలను పరిశీలించాలని విజ్ఞప్తి చేసింది. రేవంత్‌రెడ్డి అల్లుడు సత్య గోలుగూరికి చెందినదిగా పేర్కొంటున్న మ్యాక్స్‌బియన్ ఫార్మా, కుమార్తె నైమిషా రెడ్డికి సంబంధించినదిగా ఆరోపిస్తున్న వ్యాపారాలపై కూడా దర్యాప్తు చేయాలని ఈడీ, రాష్ట్రపతి, ప్రధానమంత్రి కార్యాలయం సహా పలు సంస్థలకు లేఖలు పంపినట్లు బీఆర్ఎస్ తెలిపింది.

18న సద్దుల బతుకమ్మ వైభవం

ట్యాంక్‌బండ్‌పై బతుకమ్మ సంబురం



తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పూల పండగను ఈనెల 10 నుంచి 18వ తేదీ వరకు ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. సచివాలయంలో శనివారం సీఎస్ సంజయ్ జాజు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా 18న సద్దుల బతుకమ్మను ట్యాంక్‌బండ్‌పై వేలాదిమంది మహిళలతో వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం 4 గంటలకు అమరవీరుల స్మారక కేంద్రం నుంచి మహిళలు బతుకమ్మలతో ఊరేగింపుగా ట్యాంక్‌బండ్‌కు చేరుకోనున్నారు. వందలాది మంది కళాకారులు కూడా తమ కళారూపాలతో ర్యాలీలో పాల్గొంటారు. ప్రత్యేక వేదికపై జరిగే వేడుకలకు ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు.

ట్రాఫిక్ నుంచి నిమజ్జనం వరకు

బతుకమ్మ వేడుకల సందర్భంగా హైదరాబాద్‌లోని ప్రధాన కూడళ్లలో బతుకమ్మల ఏర్పాటు, విద్యుత్ దీపాలతో అలంకరణ చేపట్టాలని సీఎస్ అధికారులను ఆదేశించారు. ట్యాంక్‌బండ్‌కు పెద్ద సంఖ్యలో మహిళలు వచ్చే అవకాశం ఉన్నందున తాగునీరు, ఇతర కనీస సౌకర్యాలు కల్పించాలని సూచించారు. చిల్డ్రన్స్ పార్క్ బతుకమ్మ ఘాట్, నెక్లెస్ రోడ్డులో నిమజ్జన ఏర్పాట్లు చేయాలని హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు. సాయంత్రం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు వేడుకలు కొనసాగనున్న నేపథ్యంలో ట్రాఫిక్ డైవర్షన్లు, బారికేడింగ్, లైటింగ్ ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. అమరవీరుల స్మారక కేంద్రం నుంచి ట్యాంక్‌బండ్ వరకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా పండగ శోభ

బతుకమ్మ పది రోజుల పాటు రవీంద్రభారతిలోనూ వేడుకలు నిర్వహించనున్నారు. రాష్ట్రంలోని పర్యాటక కేంద్రాలు, ప్రముఖ ప్రాంతాల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. బతుకమ్మ సంబరాలను ప్రతిబింబించే ప్రత్యేక లోగోను రూపొందిస్తున్నట్లు సంజయ్ జాజు తెలిపారు. డిసెంబర్‌లో జరగనున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ అంశాన్ని కూడా లోగోలో ప్రతిబింబించనున్నారు. వేడుకల ఏర్పాట్ల సమీక్షలో పర్యాటక, సాంస్కృతిక శాఖ, పోలీస్, జీహెచ్ఎంసీ, ఆర్టీసీ, ట్రాఫిక్, ఉద్యానవన శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాపై ప్రకాశ్‌రాజ్ ఫైర్

ఎస్ఐఆర్‌పై తీవ్ర అభ్యంతరాలు



హైదరాబాద్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై నటుడు ప్రకాశ్‌రాజ్ తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి ఏడాది ఓటర్ల జాబితా తనిఖీ జరుగుతుండగా ప్రత్యేక సమగ్ర సవరణ అవసరం ఏమిటని ప్రశ్నించారు. బతికున్నవారే ఓటు కోసం మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందని నిలదీశారు. ఉపాధి కోసం వలస వెళ్లినవారు ఇంట్లో అందుబాటులో లేరనే కారణంతో వారి ఓట్లు తొలగిస్తే ఎలా అని ప్రశ్నించారు. ఓటర్లను ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి మార్చినప్పుడు మొత్తం ఓటర్ల సంఖ్యలో భారీ తగ్గుదల ఉండకూడదని పేర్కొన్నారు.

చొరబాట్లకు కేంద్రమే కారణం

అక్రమ చొరబాటుదారులు ఉన్నారనే వాదనలపై కూడా ప్రకాశ్‌రాజ్ కేంద్రాన్ని ప్రశ్నించారు. ఇన్నేళ్లుగా అక్రమ చొరబాట్లు ఉంటే కేంద్ర హోంశాఖ ఎలాంటి చర్యలు తీసుకుందని నిలదీశారు. ఓటర్ల జాబితాలో ఎవరి పేర్లు ఉంచాలి, ఎవరి పేర్లు తొలగించాలనే విషయంలో బీజేపీ కార్యాలయం నుంచి జాబితాలు వెళ్తున్నాయని ఆయన ఆరోపించారు. ఆ పార్టీకి అనుకూలంగా ఉన్న ఓట్లను మాత్రమే కొనసాగిస్తున్నారన్నది తన ఆరోపణగా పేర్కొన్నారు. దళితులు, ముస్లింల ఓట్ల తొలగింపునే లక్ష్యంగా పెట్టుకున్నారంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చకు దారితీశాయి. అయితే ఇవి ప్రకాశ్‌రాజ్ చేసిన ఆరోపణలు మాత్రమే; ఎన్నికల సంఘం మాత్రం ఓటర్ల జాబితా సవరణను అర్హులైన ఓటర్లను గుర్తించి, అనర్హులైన పేర్లను తొలగించే ప్రక్రియగా వివరిస్తోంది.

ప్రకాశ్ రాజ్‌కు బీజేపీ సెగ

మీడియా మీట్ బయటే పాగ

ప్రకాశ్ రాజ్ మీడియా సమావేశం నిర్వహించిన ప్రాంతం బయట బీజేపీ కార్యకర్తల నిరసనతో ఉద్రిక్తత నెలకొంది. చేతుల్లో ప్లకార్డులు.. నోట్లో నినాదాలు.. "గో బ్యాక్ ప్రకాశ్ రాజ్ " అంటూ కార్యకర్తలు హోరెత్తించారు. రాజకీయ స్వార్థంతో రాజ్యాంగబద్ధ వ్యవస్థలను, ఎన్నికల కమిషన్‌ను అప్రతిష్టపాలు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని వారు ఆరోపించారు. ఎన్నికల్లో గెలిస్తే ఒక మాట.. ఓడిపోతే మరో మాట చెప్పడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందంటూ బీజేపీ నేతలు విమర్శలు గుప్పించారు. దీంతో మీడియా సమావేశం కంటే బయట సాగిన నిరసన చర్చనీయాంశంగా మారింది.

బీజేపీ తెలంగాణ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ డా. బూర నర్సయ్య గౌడ్ కాంగ్రెస్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. కేరళలో వామపక్ష కూటమి ఓటమికి 'ఎస్ఐఆర్' కారణమంటూ వచ్చిన వాదనలపై కాంగ్రెస్ ఎందుకు మౌనంగా ఉందని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలోనే అంతర్జాతీయ న్యాయ నిపుణుల ఆమోదంతో ఈవీఎంల వినియోగం అమల్లోకి వచ్చిందని గుర్తుచేశారు. ఇప్పుడు ఈవీఎంలపై అభ్యంతరాలు ఎందుకంటూ ప్రశ్నించారు. "గెలిచినప్పుడు ఒక న్యాయం..ఓడినప్పుడు మరో న్యాయమా?" అంటూ కాంగ్రెస్ తీరును బీజేపీ నేతలు ప్రశ్నించారు.



లక్షకు ఐదు తులాల మాయ

మణికొండలో ఘరానా మోసం



బంగారం ధర తులం రూ.1.50 లక్షలు దాటుతున్న కాలంలో.. "లక్ష రూపాయలు ఇవ్వండి.. ఐదు తులాల బంగారం పట్టుకెళ్లండి" అంటే ఎవరైనా అనుమానం పడాలి. కానీ ఆశకు లెక్కలుండవు కదా! అదే జరిగింది. హైదరాబాద్ మణికొండలో ఉంటున్న గుంతకల్లుకు చెందిన శిల్ప, తన భర్త దుబాయిలో ఉంటారని, అక్కడి నుంచి తక్కువ ధరకు బంగారం తెప్పించి ఇస్తానని అనంతపురం రూరల్ మండల సుబ్బారెడ్డికాలనీకి చెందిన ముగ్గురు మహిళలను నమ్మించింది. మార్కెట్ ధరకు పావు ధరకు బంగారం అంటేనే డౌటు రావాలి.. కానీ ఇక్కడ డౌటుకు బదులు డబ్బులే వెళ్లాయి! ఒక మహిళ ఏకంగా రూ.14 లక్షలను శిల్ప ఖాతాకు బదిలీ చేసింది. మిగిలిన ఇద్దరూ లక్షల రూపాయలు చెల్లించారు.

బంగారం లేదు.. బదులు లేదు!

డబ్బులు వెళ్లిన తర్వాత అసలు సినిమా మొదలైంది. బంగారం ఎప్పుడు ఇస్తారని అడిగితే సమాధానం లేదు. డబ్బులు తిరిగి ఇవ్వమంటే స్పందన లేదు. ఐదు తులాల బంగారం మాట పక్కన పెడితే.. ఒక్క గ్రాము బంగారం కూడా చేతికి రాలేదు! ఎన్నిసార్లు అడిగినా సరైన సమాధానం లేకపోవడంతో తాము మోసపోయామని బాధితులు గుర్తించారు. చివరకు ఆశను పక్కనపెట్టి పోలీసులను ఆశ్రయించారు. అనంతపురం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఈ ఘటనలో ఇంకెంతమంది "లక్షకు ఐదు తులాలు" అనే మాయమాటకు బలయ్యారన్నది తేలాల్సి ఉంది.

ఆశకు మించిన ఆఫర్.. చివరకు షాక్

ఈ వ్యవహారంలో మొత్తం ఎంత డబ్బు వసూలు చేశారు? ఎంతమంది బాధితులు ఉన్నారు? అనే కోణాల్లో పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తామని సీఐ శ్రీకాంత్‌యాదవ్ తెలిపారు. బంగారం ధర రోజురోజుకూ పెరుగుతున్న సమయంలో ఇంత భారీ తేడాతో బంగారం ఇస్తామంటే కాస్త బుద్ధిని బ్యాగులోంచి బయటకు తీసి చూసుకోవాల్సిందే! "దుబాయ్ నుంచి చీప్‌గా వస్తుంది" అన్న మాట విని డబ్బులు పంపితే.. చివరకు దుబాయ్ దూరం కాదు, పోలీస్ స్టేషన్ దగ్గరైపోయింది. అత్యాశ చూపించే ఆఫర్ వెనుక అసలు ఉద్దేశం ఏమిటో ముందే పరిశీలించకపోతే.. బంగారం కొనాలనుకున్నవారికి చివరికి బంగారం కాదు, బొంగురం మిగులుతుంది!



ఎల్‌నినో టెర్రర్

- భారత్‌కు వార్నింగ్ బెల్స్
- రేపటి ముప్పు నేటి హెచ్చరిక

ఎండ వస్తుంది.. పోతుంది అనుకున్నాం. కానీ ఇప్పుడు ఎండే మన భవిష్యత్తును వెంటాడే ముప్పుగా మారుతోంది. సముద్రంలో మొదలైన ఎల్‌నినో ప్రభావం వేల కిలోమీటర్లు దాటి భారత్ తలుపు తడుతోంది. ప్రపంచవ్యాప్తంగా 4.51 లక్షల అదనపు వేడి మరణాలు సంభవించే అవకాశం ఉందన్న పరిశోధకుల అంచనా ఒక్కసారిగా ఆందోళన రేపుతోంది. ఆ ముప్పులో భారత్ కూడా తీవ్రంగా ప్రభావితమయ్యే దేశాల జాబితాలో ఉంది. మరింత భయపెట్టేది ఇంకొక విషయం.. ఇప్పుడు కనిపిస్తున్న ఈ ఉష్ణోగ్రతలే మరో 20 ఏళ్లలో సాధారణ వాతావరణంగా మారవచ్చని శాస్త్రవేత్తల హెచ్చరిక. అంటే ఇది ఒక్క వేసవి కథ కాదు.. రాబోయే తరాల జీవనానికి ముందస్తు హెచ్చరిక. తెలుగు రాష్ట్రాల పరిస్థితి మరింత కీలకం. తెలంగాణలో మండే ఎండలు, ఆంధ్రప్రదేశ్‌లో నీటి కొరత, రైతుల పంటలపై ఒత్తిడి, బయట పనిచేసే కార్మికుల ఆరోగ్యం, పట్టణాల్లో తాగునీటి అవసరం.. ఒక్కో సమస్య మరో సమస్యను లాగుతోంది. ఎక్కడో కరువు.. ఇంకెక్కడో అకాల వర్షం.. మరోచోట వరద! ఎల్‌నినో కేవలం ఉష్ణోగ్రతలను పెంచుతుందా? లేక మన జీవన విధానాన్నే మార్చబోతుందా? రాబోయే రోజుల్లో మన ముందున్న అసలు సవాలు ఏంటి?

ఎల్‌నినో ప్రభావం ప్రపంచాన్ని వణికించేలా మారుతోంది. ప్రస్తుత ఎల్‌నినో కారణంగా వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు ప్రపంచవ్యాప్తంగా సుమారు 4.51 లక్షల అదనపు వేడి మరణాలు సంభవించే అవకాశం ఉందని క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్ అంచనా వేసింది. భారత్ అత్యధిక ప్రభావం ఎదుర్కొనే దేశాల జాబితాలో ఉంది. సెప్టెంబరు-ఫిబ్రవరి మధ్య భారత్‌లో సాధారణం కంటే సుమారు 15,800 అదనపు వేడి మరణాలు సంభవించవచ్చని అధ్యయనం అంచనా వేస్తోంది. అంతేకాదు, వచ్చే 20 ఏళ్లలో సాధారణంగా మారే ఉష్ణోగ్రతలు ఇప్పుడే ఒకేసారి కనిపిస్తున్నాయని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. ఇది కేవలం ఎండల సమస్య కాదు.. నీటి కొరత, పంట నష్టం, ఆహార భద్రత, విద్యుత్ డిమాండ్, ప్రజారోగ్యంపై పెరుగుతున్న ఒత్తిడికి సంకేతం.

తెలుగు రాష్ట్రాలకు పెను సవాలు

ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు ఈ హెచ్చరిక మరింత కీలకం. భారత వాతావరణ శాఖ 2026 జూన్‌లో ఆంధ్రప్రదేశ్‌లో సాధారణం కంటే ఎక్కువ వేడి తరంగ దినాలు నమోదయ్యే అవకాశం ఉందని, తెలంగాణలోనూ కొన్ని ప్రాంతాల్లో అధిక వేడి ముప్పు ఉంటుందని ముందే సూచించింది. తీవ్ర ఉష్ణోగ్రతలు కొనసాగితే తాగునీటి లభ్యత, వ్యవసాయం, పశుసంవర్ధక రంగం, బయట పనిచేసే కార్మికుల ఆరోగ్యం, ఆస్పత్రులపై ఒత్తిడి పెరగవచ్చు. ఎల్‌నినో వర్షపాత సమూనాలను కూడా మార్చగలగడంతో కొన్ని ప్రాంతాల్లో కరువు, మరికొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు, వరదల ముప్పు ఏర్పడుతుంది. అందుకే తెలుగు రాష్ట్రాల్లో ముందస్తు వేడి హెచ్చరికలు, నీటి నిల్వలు, శీతలీకరణ కేంద్రాలు, కార్మికులకు రక్షణ, ఆస్పత్రుల్లో అత్యవసర సన్నద్ధతపై ఇప్పటి నుంచే దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ఎల్‌నినో చూపిస్తున్నది రేపటి వాతావరణం కాదు.. రేపటి జీవన సవాళ్లకు ముందస్తు హెచ్చరిక.

ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు

- సమస్యల పరిష్కారానికి మానవీయ దృక్పథం

ఆటో డ్రైవర్లు, రవాణా రంగ కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయనుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ప్రజాభవన్‌లో శనివారం హైదరాబాద్ ఆటో డ్రైవర్ల సంఘాల జేఏసీ నాయకులకు ఇచ్చిన ఆత్మీయ విందులో ఆయన మాట్లాడారు. కిలోమీటర్‌కు రూ.11గా ఉన్న ఆటో ఛార్జీని రూ.14కు పెంచుతూ ప్రభుత్వం ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. రవాణా రంగంలో దాదాపు 20 లక్షల కార్మిక కుటుంబాలు ఉన్నాయని, వారి సంక్షేమ బోర్డుపై కేబినెట్‌లో చర్చ జరిగిందని చెప్పారు. చట్టసభల్లో చర్చించి అవసరమైన నిధులు కేటాయించిన తర్వాత బోర్డు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఆటో డ్రైవర్ల ఇతర న్యాయమైన సమస్యలను కూడా మానవీయ కోణంలో పరిశీలిస్తామని స్పష్టం చేశారు.

డీజిల్ నుంచి బ్యాటరీ ఆటోల వైపు

ఆటో డ్రైవర్ల సమస్యలను మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యయనం చేసి ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చారని భట్టి తెలిపారు. 'రాజీవ్ యువ వికాసం' కింద డీజిల్ ఆటోలను బ్యాటరీ ఆటోలుగా మార్చేందుకు రూ.200 కోట్లు కేటాయించామని, ఒక్కో ఆటోకు రూ.1.50 లక్షల సబ్సిడీ అందిస్తున్నామని చెప్పారు. భవిష్యత్తులో సోలార్, బ్యాటరీ, సీఎన్‌జీ ఆటోలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. పెరుగుతున్న ధరల నేపథ్యంలో రూ.14 ఛార్జీ సరిపోతుందా అనే అంశాన్ని కూడా పరిశీలిస్తామని చెప్పారు. ప్రభుత్వం కేవలం ఉత్తర్వులు జారీ చేయడం కాకుండా ఆటో కార్మికులను నేరుగా కలుసుకుని వారి సమస్యలు తెలుసుకోవడమే లక్ష్యంగా పనిచేస్తోందని భట్టి పేర్కొన్నారు. కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ పాల్గొన్నారు.



ప్రేమకు కూడా 'అన్‌ఫాలో' షాక్!

- బ్రేక్‌ఫాస్ట్‌లో ప్రేమ.. వారంలో బ్రేకప్

ప్రేమ కథలు సినిమాల్లోనే ఒక్కసారిగా మలుపు తిరుగుతాయని అనుకుంటే.. ఎలన్ మస్క్-శివోన్ జిలిస్ కథ మాత్రం "నిజ జీవిత ట్విస్ట్" చూపించింది. అక్టోబర్ 2న శివోన్ చేసిన సోషల్ మీడియా పోస్టుతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. "వారం రోజుల వ్యవధిలో ప్రేమ నుంచి విడిపోవాల్సి వచ్చింది.. ఎలాంటి హెచ్చరిక లేకుండానే" అంటూ ఆమె పేర్కొంది. సెప్టెంబర్ 24న ఇద్దరూ మెసేజ్‌ల్లో "లవ్ యూ" చెప్పుకున్న తర్వాత.. కథ ఇంత వేగంగా బ్రేకప్ దాకా రావడమే ఇప్పుడు అసలు సెన్సేషన్. అంతకుముందు ఇద్దరూ కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేసిన విషయాన్ని కూడా శివోన్ గుర్తుచేసుకుంది. ఇంతకీ ప్రేమకు ఇంత షార్ట్‌కట్ ఎందుకు? అన్నదే నెటిజన్ల చర్చ.

"న్యూ డే.. న్యూ లైఫ్" అన్నదే క్లూ!

శివోన్ పోస్టులో మరో డైలాగ్ కూడా ఇప్పుడు వైరల్ అవుతోంది. సెప్టెంబర్ 27న ఆమె "న్యూ డే, న్యూ లైఫ్" అంటూ చిన్న పోస్టు పెట్టింది. చూస్తుంటే అప్పటికే కథలో క్లైమాక్స్ మొదలైనట్టే! మస్క్ తనను ఎక్స్‌లో అన్‌ఫాలో చేసిన తర్వాత శివోన్ సుదీర్ఘమైన ప్రకటన చేయడం మరింత ఆసక్తిని పెంచింది. మస్క్‌తో తన బంధాన్ని గుర్తుచేసుకున్న ఆమె, ఆయనను "టార్చర్డ్ సోల్"గా అభివర్ణించింది. తమ పిల్లలు మస్క్‌కు ప్రశాంతమైన స్థలం కల్పించేవారని చెప్పింది. ప్రేమ పోయినా.. అభిమానం మాత్రం పోలేదని చెబుతూ ఆయన సంతోషంగా ఉండాలని కోరుకుంది. మస్క్ మాత్రం ఇప్పటివరకు బ్రేకప్‌పై స్పందించలేదు.

నాలుగు పిల్లలు.. కథకు కొత్త మలుపు

మస్క్, శివోన్‌కు 2021లో కవలలు స్ట్రైడర్, అజూర్ జన్మించారు. 2024లో ఆర్కేడియా, 2025లో సెల్డన్ పుట్టారు. అంటే బ్రేకప్ కథలో కూడా నాలుగు చిన్న పాత్రలు కాదు.. నాలుగు జీవితాల బాధ్యత ఉంది. మస్క్‌కు వివిధ సంబంధాల ద్వారా కనీసం 14 మంది పిల్లలు ఉన్నారు. అందుకే ఈ కథను కేవలం "అన్‌ఫాలో-బ్రేకప్" అంటూ ముగిస్తే అసలు విషయం మిస్సవుతుంది. ఒకవైపు ప్రేమ, మరోవైపు కుటుంబం.. మధ్యలో ఒక్కసారిగా బ్రేకప్! సోషల్ మీడియా యుగంలో "గుడ్ మార్నింగ్ లవ్" నుంచి "గుడ్‌బై" వరకు గ్యాప్ ఎంత చిన్నదో ఈ కథ మరోసారి చూపించింది.

హీరో పైలట్‌కు దుబాయ్ యువరాజు పరామర్శ

- ఆసుపత్రికి వచ్చి మరీ స్మిత్ మచ్చర్‌కు థ్యాంక్స్





దుబాయ్ క్రౌన్ ప్రిన్స్ షేక్ హమ్దాన్ బిన్ మహమ్మద్ బిన్ రషీద్ అల్ మక్తూమ్, ప్రాణాలకు తెగించి 172 మంది ప్రయాణికులు, సిబ్బంది ప్రాణాలు కాపాడిన భారతీయ పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్‌ను ఆసుపత్రిలో పరామర్శించారు. దుబాయ్ నుంచి టెల్ అవీవ్ వెళ్తున్న ఫ్లై దుబాయ్ విమానంలో స్మిత్ మచ్చర్ కెప్టెన్‌గా ఉన్నారు. విమానం గాల్లో ఉండగానే సహ పైలట్ హమామ్ అల్‌హమ్మామి, కాక్‌పిట్ క్రాష్ యాక్స్‌తో కెప్టెన్‌పై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడినప్పటికీ స్మిత్ పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోరాడారు.

గాయాలతోనూ తెరిచిన కాక్‌పిట్ తలుపు

ఇద్దరు పైలట్ల మధ్య జరిగిన పెనుగులాటలో విమానం వేల అడుగుల మేర కిందికి పడిపోయింది. ప్రమాదం తప్పదనే పరిస్థితి నెలకొంది. అయినా స్మిత్ అసాధారణ ధైర్యం ప్రదర్శించారు. కాక్‌పిట్ తలుపు తెరిచి ప్రయాణికులను అప్రమత్తం చేశారు. వెంటనే ప్రయాణికులు లోపలికి దూసుకెళ్లి దాడి చేసిన సహ పైలట్‌ను అదుపులోకి తీసుకున్నారు. విమానాన్ని స్థిరంగా నడిపేందుకు ఆఫ్‌డ్యూటీ పైలట్లు కూడా సహకరించారు. స్మిత్ చూపిన సమయస్ఫూర్తి కారణంగానే భారీ ప్రాణనష్టం తప్పిందని ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

స్మిత్‌పై ప్రశంసల జల్లు

స్మిత్‌ను పరామర్శించిన అనంతరం క్రౌన్ ప్రిన్స్ ఆయన ధైర్యాన్ని కొనియాడారు. దేశ నాయకత్వం తరఫున పూర్తి అభినందనలు, ప్రశంసలు అందిస్తున్నామని తెలిపారు. స్మిత్ తమ బృందంలో భాగమని, యూఏఈ నిలబెట్టే మానవత్వం, శాంతి, ప్రాణాల విలువకు ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా భారత పైలట్ సాహసాన్ని ప్రశంసించారు. దాడి వెనుక కారణాలపై దర్యాప్తు కొనసాగుతోంది.

కోలుకుంటున్న భారత వీరుడు

ఈ ఘటనపై ఉగ్రవాద సంబంధిత కోణం ఉందా అనే అంశాన్ని కూడా యూఏఈ అధికారులు పరిశీలిస్తున్నారు. సహ పైలట్ గతంలో ఒమన్‌లో విమానాలు నడపకుండా నిషేధానికి గురైనట్లు వాల్ స్ట్రీట్ జర్నల్ నివేదించింది. ప్రస్తుతం స్మిత్ తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. యూఏఈలోని భారత రాయబార కార్యాలయం ఆయన ఆరోగ్యం మెరుగుపడుతోందని తెలిపింది. కుటుంబంతో నిరంతరం సంప్రదింపులు కొనసాగిస్తున్నామని వెల్లడించింది. స్మిత్ తండ్రి భూపేంద్ర మచ్చర్ మాత్రం గాయాలు పూర్తిగా తగ్గేందుకు ఇంకా చాలా సమయం పడుతుందని తెలిపారు.

లోక్‌సభ, అసెంబ్లీ

ఎన్నికలు రద్దు చేయాలి

- దేశ వ్యాప్తంగా బ్యాలెట్‌తో ఎన్నికల జరపాలి
- మళ్లీ ఎన్నికలు పెట్టాలన్న ఏఐసీసీ చీఫ్ ఖర్గే



ప్రస్తుతం కొనసాగుతున్న లోక్‌సభ, అన్ని రాష్ట్రాల శాసనసభలను రద్దు చేసి కొత్తగా ఎన్నికలు నిర్వహించాలని కలబుర్గిలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలు పెను దుమారం రేపుతున్నాయి. ఈసారి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల స్థానంలో బ్యాలెట్ పత్రాలతోనే ఎన్నికలు జరపాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులు, రాష్ట్రాల ముఖ్యమంత్రుల ఎన్నికల చట్టబద్ధతపైనా ఖర్గే తీవ్ర ఆరోపణలు చేశారు. దేశం మొత్తం అక్రమ ఎన్నికలతో నడుస్తోందని ఆయన వ్యాఖ్యానించారు.

ఓటర్ల జాబితాలపైనా రగడ

ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై కాంగ్రెస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిస్తున్నారని ఖర్గే ఆరోపించారు. పేదలు, కార్మికులు, నిరక్షరాస్యులు, అణగారిన వర్గాలు, మైనారిటీలు ఎక్కువగా నష్టపోతున్నారని ఆయన పేర్కొన్నారు. ఒకే పోలింగ్ కేంద్ర పరిధిలో వందల పేర్లు తొలగిస్తే స్వేచ్ఛాయుత ఎన్నికలు ఎలా సాధ్యమవుతాయని ప్రశ్నించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల వినియోగంపైనా అనుమానాలు వ్యక్తం చేస్తూ బ్యాలెట్ విధానాన్ని తిరిగి తీసుకురావాలని కోరారు.

అక్టోబర్ 6న ఢిల్లీలో పోరుబాట

ఈ అంశాలపై ప్రతిపక్ష కూటమి ఉద్యమ కార్యాచరణకు సిద్ధమైంది. సెప్టెంబర్ 30న జరిగిన సమావేశంలో ఎన్నికల పారదర్శకత, ఓటర్ల జాబితాలు, ఎన్నికల సంఘం స్వతంత్రతపై పోరాటం కొనసాగించాలని నిర్ణయించారు. అక్టోబర్ 2 నుంచి 8 వరకు జిల్లాల వారీగా ప్రజాస్వామ్య పరిరక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అక్టోబర్ 6న ప్రతిపక్ష ఎంపీలు ఎన్నికల సంఘం కార్యాలయం వైపు భారీ ప్రదర్శన చేపట్టనున్నారు. నవంబర్ 1న ఢిల్లీలో భారీ బహిరంగ సభకు సైతం ప్రణాళిక రూపొందించారు.

ఖర్గే వ్యాఖ్యలపై

బీజేపీ ఎదురుదాడి

ప్రజాతీర్పును అవమానించొద్దన్న చౌహాన్



కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలను "అక్రమ" నేతలుగా పేర్కొనడంపై కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తీవ్రంగా స్పందించారు. ఖర్గే వ్యాఖ్యలు రాజ్యాంగబద్ధ సంస్థలతో పాటు ప్రజలు ఇచ్చిన తీర్పును అవమానించడమే అని ఆయన ఆరోపించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిన ప్రతిసారీ ప్రజాస్వామ్యం, ఎన్నికల సంఘం, ఈవీఎంలు, ప్రజాతీర్పుపై అనుమానాలు వ్యక్తం చేయడం ఆ పార్టీకి అలవాటుగా మారిందని విమర్శించారు. కర్ణాటక, తెలంగాణ, హిమాచల్‌ప్రదేశ్‌లో కాంగ్రెస్ గెలిచిన సమయంలో ఈవీఎంలపై ఇలాంటి ప్రశ్నలు ఎందుకు రాలేదని చౌహాన్ ప్రశ్నించారు. ప్రజలు ఇచ్చే తీర్పే ప్రజాస్వామ్యానికి ప్రాతిపదిక అని పేర్కొన్నారు.

ఈవీఎంలు, ఎన్నికల కమిషన్‌పై సమర్థన


ఎన్నికల కమిషనర్ల నియామకంపై ఖర్గే ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని చౌహాన్ ఆరోపించారు. 2023లో తీసుకొచ్చిన ఎన్నికల కమిషనర్ల నియామక చట్టాన్ని పార్లమెంట్ ఆమోదించిందని, ఎన్నికల కమిషనర్ల ఎంపిక కమిటీలో ప్రతిపక్ష నేతకు కూడా స్థానం ఉందని ఆయన చెప్పారు. ఓటర్ల జాబితాల సవరణ నిరంతర చట్టబద్ధ ప్రక్రియగా పేర్కొంటూ, నకిలీ, ఒకే వ్యక్తికి చెందిన బహుళ నమోదులను తొలగిస్తూ అర్హులైన ఓటర్లను చేర్చడం ఎన్నికల సంఘం బాధ్యత అని వివరించారు. ఈవీఎంల విశ్వసనీయతను సుప్రీంకోర్టు పలుమార్లు సమర్థించిందని చౌహాన్ పేర్కొన్నారు. బ్యాలెట్ పత్రాల విధానానికి తిరిగి వెళ్లడం వల్ల గతంలో కనిపించిన బూత్ ఆక్రమణలు, బ్యాలెట్ పెట్టెల దోపిడీ, హింసాత్మక ఘటనలు మళ్లీ వచ్చే ప్రమాదం ఉందని ఆయన ఆరోపించారు.

టైం మెషీన్ మాయావి సింగీతం శ్రీనివాసరావు ఇకలేరు

కాలాన్ని తెరపై తిప్పిన సృజనాత్మక మాంత్రికుడు

ప్రయోగాలతో సినిమా భాషనే మార్చిన దర్శకుడు

ఒక దర్శకుడు సినిమా తీస్తాడు.. మరో దర్శకుడు సినిమాకే కొత్త ఊహను నేర్పిస్తాడు. సింగీతం శ్రీనివాసరావు ఆ రెండో కోవకు చెందిన మాయావి. తెరపై కాలాన్ని వెనక్కి తిప్పి 'ఆదిత్య 369'లో భవిష్యత్తును చూపించిన సృజనశీలి.. మాటలు లేకుండానే 'పుష్పక విమానం'తో కథ చెప్పిన ప్రయోగశీలి.. జానపదాన్ని, హాస్యాన్ని, విజ్ఞాన కల్పనను తనదైన శైలిలో మలిచిన అరుదైన దర్శకుడు. తెలుగు సినిమా ఊహలకు రెక్కలు తొడిగిన ఆ మహా మాంత్రికుడు ఇక లేరు. కానీ ఆయన సృష్టించిన ప్రపంచాలు చావవు. తెరపై కొత్త ఆలోచన మెరుస్తున్న ప్రతిసారీ.. అసాధ్యాన్ని సాధ్యంగా చూపించాలనే ప్రతి ప్రయత్నంలో.. సింగీతం అనే ఆ మాయావి మళ్లీ మళ్లీ కనిపిస్తూనే ఉంటారు.





తెలుగు సినిమా చరిత్రలో కొందరు దర్శకులు సినిమాలు తీస్తారు.. మరికొందరు దర్శకులు సినిమా భాషనే మార్చేస్తారు. సింగీతం శ్రీనివాసరావు ఆ రెండో కోవకు చెందిన అరుదైన సృజనశీలి. 1931 సెప్టెంబరు 21న నెల్లూరు జిల్లా ఉదయగిరిలో జన్మించిన ఆయనకు చిన్ననాటి నుంచే కళలపై ఆసక్తి. మద్రాస్ విశ్వవిద్యాలయంలో విద్యాభ్యాసం అనంతరం మహాదర్శకుడు కె.వి.రెడ్డి వద్ద సహాయకుడిగా పనిచేయడం ఆయన సినీ ప్రయాణానికి బలమైన పునాది వేసింది. 'మాయాబజార్', 'జగదేకవీరుని కథ' వంటి అద్భుతాల వెనుక పనిచేసిన ఆ అనుభవం.. తర్వాత సింగీతం ఆలోచనా విధానంలో స్పష్టంగా కనిపించింది. 1972లో 'నీతి నిజాయితీ'తో దర్శకుడిగా పరిచయమైన ఆయన.. అప్పటి మూస కథనాలకు భిన్నంగా ప్రతి చిత్రంలో ఏదో ఒక కొత్తదనాన్ని వెతికారు. సామాజిక కథలు, హాస్యం, ప్రేమ, జానపదం, చారిత్రక ఇతివృత్తాలు, విజ్ఞాన కల్పన.. ఇలా ఒక్కోసారి ఒక్కో ప్రపంచంలోకి ప్రేక్షకులను తీసుకెళ్లారు. తెలుగు మాత్రమే కాదు.. తమిళం, కన్నడ, హిందీ, మలయాళం, ఆంగ్ల భాషల్లోనూ ఆయన తన ముద్ర వేశారు. మొత్తంగా సుమారు ఆరు దశాబ్దాల సినీ ప్రయాణంలో దాదాపు 60 చిత్రాలకు దర్శకత్వం వహించారు.

అసాధారణ ప్రజ్ఞకు చిరునామా

సింగీతం పేరు చెబితే ముందుగా గుర్తుకొచ్చేది ప్రయోగాల పరంపర. 'సొమ్మొకడిది.. సోకొకడిది'తో హాస్యానికి కొత్త ఊపు తీసుకొచ్చిన ఆయన.. 'మయూరి'తో ఒక నిజజీవిత పోరాటాన్ని స్ఫూర్తిదాయకమైన సినిమాగా మలిచారు. 'పుష్పక విమానం'లో మాటలే లేకుండా కథ చెప్పి జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకున్నారు. కమల్‌హాసన్‌తో ఆయన చేసిన 'పుష్పక విమానం', 'అపూర్వ సోదరులు', 'మైఖేల్ మదన కామరాజన్' వంటి చిత్రాలు ఆయన ప్రయోగాత్మక దృష్టికి నిదర్శనాలు. కానీ సింగీతం ఊహాశక్తికి అసలు అద్దం 'ఆదిత్య 369'. టైం మెషీన్‌లో ప్రయాణిస్తూ శ్రీకృష్ణదేవరాయల కాలాన్ని చూడటం.. అక్కడి నుంచి భవిష్యత్తులోకి వెళ్లడం.. ఆ రోజుల్లోనే ఇంతటి విజ్ఞాన కల్పనను తెలుగు తెరపై ఆవిష్కరించడం ఒక సాహసమే. 'భైరవద్వీపం'లో జానపద ఫాంటసీకి కొత్త అందం తీసుకొచ్చారు. 'మేడమ్', 'శ్రీకృష్ణార్జున విజయం', 'ముంబై ఎక్స్‌ప్రెస్', 'ఘటోత్కచ' వంటి చిత్రాలతో తన ప్రయోగాలకు హద్దులు లేవని నిరూపించారు. దర్శకుడిగానే కాకుండా రచయితగా, నిర్మాతగా, సంగీత దర్శకుడిగా, నటుడిగా కూడా పనిచేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి ఆయన.

మాయల మాంత్రికుడి సాహసాలు

విఠలాచార్య తెలుగు సినిమాకు జానపదం, మాయాజాలం, అద్భుతాల ప్రపంచాన్ని చూపించిన తరం అయితే.. సింగీతం ఆ ఊహకు ఆధునిక ప్రయోగాల రెక్కలు తొడిగిన దర్శకుడు. అందుకే ఆయనను కేవలం 'విభిన్న చిత్రాల దర్శకుడు' అని పిలవడం సరిపోదు.. సినిమా అనే మాధ్యమంతో ప్రయోగాలు చేయడానికి భయపడని మాయావి అనడమే సరైన నివాళి. ప్రేక్షకుడు ఏమి కోరుకుంటాడో ఊహించి అదే ఇవ్వడం కన్నా.. ప్రేక్షకుడు ఇంతవరకు ఊహించనిదాన్ని తెరపై చూపించడమే తన ధ్యేయంగా పెట్టుకున్న దర్శకుడు సింగీతం. ఆయన చిత్రాల్లో నవ్వు ఉంది.. కన్నీరు ఉంది.. ప్రేమ ఉంది.. జానపదం ఉంది.. విజ్ఞానం ఉంది.. ముఖ్యంగా 'ఇంకేదైనా కొత్తగా చేయొచ్చుకదా' అనే తపన ఉంది. కాలాన్ని వెనక్కి తిప్పే టైం మెషీన్‌ను 'ఆదిత్య 369'లో సృష్టించిన ఆ మాంత్రికుడు.. తాను మాత్రం కాలానికి అందకుండా తన సినిమాల్లో శాశ్వతంగా నిలిచిపోయారు. సింగీతం శ్రీనివాసరావు ఇక లేరు.. కానీ సింగీతం అనే ఆలోచన చావదు. తెరపై ప్రయోగం ఉన్నంతకాలం.. కొత్త కథ చెప్పాలనే తపన ఉన్నంతకాలం.. ఆ మాయావి మన మధ్యే ఉంటారు.

పేదల ఇళ్లపై కాంగ్రెస్ ప్రశ్నల వర్షం



పులివెందుల మెగా లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణ పరిస్థితులపై కాంగ్రెస్ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. పేదల సొంతింటి కలను వైసీపీ, టీడీపీ ప్రభుత్వాలు నెరవేర్చడంలో విఫలమయ్యాయని కాంగ్రెస్ రాష్ట్ర మీడియా చైర్మన్, మాజీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ సగ్రెడ్డి తులసిరెడ్డి,పులివెందుల నియోజకవర్గ కాంగ్రెస్ సమన్వయకర్త మూలంరెడ్డి ధ్రువకుమార్‌రెడ్డి విమర్శించారు. మెగా లేఅవుట్‌ను పరిశీలించిన వారు ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పేద కుటుంబానికి సొంత ఇల్లు కేవలం ఓ నిర్మాణం కాదని, జీవితకాల ఆశయమని పేర్కొన్నారు. ప్రభుత్వాలు ఈ అంశాన్ని ప్రాధాన్యంగా తీసుకుని నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కోరారు. 1975లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ప్రారంభించిన 20 సూత్రాల ఆర్థిక కార్యక్రమంలో 'అందరికీ ఇల్లు'కు ప్రాధాన్యం ఇచ్చిన విషయాన్ని తులసిరెడ్డి, ధ్రువకుమార్ రెడ్డి గుర్తుచేశారు. పేదలకు ఇళ్ల విషయంలో హామీలకే పరిమితం కాకుండా స్పష్టమైన కార్యాచరణతో ముందుకు వెళ్లాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. పులివెందుల మెగా లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణం పూర్తిచేసి లబ్ధిదారులకు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

పూలే దంపతులకు బీజేపీ నేతల ఘన నివాళి



ప్రొద్దుటూరులో సేవా సంకల్ప్ అభియాన్ లో భాగంగా మహాత్మా జ్యోతిరావు పూలే,సావిత్రిబాయి పూలే విగ్రహాలకు బీజేపీ ఓబీసీ మోర్చా నాయకులు ఘనంగా నివాళులర్పించారు. శనివారం నిర్వహించిన కార్యక్రమంలో తొలుత విగ్రహాలను శుభ్రం చేసి పూలమాలలు వేశారు. కార్యక్రమానికి బుర్ర రామాంజనేయలు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ముప్పే వెంకట్ నాయుడు మాట్లాడుతూ సమానత్వం, విద్య, సామాజిక చైతన్యం కోసం పూలే దంపతులు చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ముఖ్యంగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతి, విద్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు నరేంద్ర, జిల్లా కార్యదర్శి చిరంజీవిరెడ్డి, చలపతిరావు, బీజేవైఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు పరమేశ్వరరావు, సంజీవరాయుడు, హరి యాదవ్, అఖిల, రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు కుమారి రెడ్డి ప్రసన్న, పట్టణ ఉపాధ్యక్షురాలు సంజీవరెడ్డి, రమణయ్యతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

స్థానిక పోరుకు వైసీపీ శ్రేణులు సిద్ధం



ప్రొద్దుటూరు, అక్టోబర్ 3: రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు వైసీపీ శ్రేణులను సమాయత్తం చేస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు.కొర్రపాడు రోడ్డులోని పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో కార్యకర్తలకు గుర్తింపు కార్డులు పంపిణీ చేసిన ఆయన, ప్రొద్దుటూరు నియోజకవర్గంలో 10,137 మంది కార్యకర్తలకు కార్డులు అందిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో సుమారు 17 లక్షల మందికి కార్డులు పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. స్థానిక ఎన్నికల్లో ప్రొద్దుటూరు నుంచి సుమారు 400 మంది వైసీపీ తరఫున పోటీకి సిద్ధమవుతున్నారని తెలిపారు.కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన కార్యకర్తలకు భవిష్యత్తులో ప్రాధాన్యత కల్పిస్తామని చెప్పారు. వైసీపీ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న అసంతృప్తిని పార్టీకి అనుకూలంగా మలచాలని కోరారు. స్థానిక ఎన్నికలను పార్టీ బలోపేతానికి అవకాశంగా వినియోగించాలని జిల్లా నేతలు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాతమ్మలతో చిన్నారుల సందడి



వేంపల్లెలోని శ్లోకా పాఠశాలలో గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు ఆత్మీయంగా, ఆనందంగా జరిగాయి. శనివారం పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు తమ తాత, అమ్మమ్మలతో కలిసి ఉత్సాహంగా పాల్గొన్నారు. మనవళ్లు, మనవరాళ్లు తమ పెద్దల కోసం ప్రత్యేకంగా నృత్యాలు, ఆటలు, పాటలు, పద్యాలు ప్రదర్శించి అలరించారు. చిన్నారుల సందడితో పాఠశాల ప్రాంగణం ఆహ్లాదకరంగా మారింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ బండి నవనీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ పిల్లల వ్యక్తిత్వ వికాసంలో తాత, అమ్మమ్మల పాత్ర ఎంతో ప్రత్యేకమని అన్నారు. వారి అనుభవాలు, ఆప్యాయత, విలువలు చిన్నారులకు జీవిత పాఠాలను అందిస్తాయని పేర్కొన్నారు. తరతరాల మధ్య అనుబంధాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు, పిల్లల్లో పెద్దల పట్ల గౌరవభావాన్ని పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థుల తాతలు, అమ్మమ్మలు పాల్గొని వేడుకలను ఆనందంగా ఆస్వాదించారు.

సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు



ప్రొద్దుటూరు, అక్టోబర్ 3: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 5న ప్రొద్దుటూరు మండలంలో పర్యటించనున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం హెలీప్యాడ్, సభా వేదిక, భద్రతా ఏర్పాట్లను ముమ్మరం చేసింది. కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా అమృత్‌నగర్ హెలీప్యాడ్‌ను పరిశీలించి ఇంజినీర్లకు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి వెంట వచ్చే నాయకుల కదలికలకు అనుగుణంగా బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం కొర్రపాడు రోడ్డు సర్కిల్‌లో జల్‌జీవన్ మిషన్ అభివృద్ధి పనుల పైలాన్‌ను పరిశీలించి పనులు వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రొద్దుటూరు బైపాస్-జమ్మలమడుగు మార్గంలోని ప్రజావేదిక సభా ప్రాంగణంలో గ్యాలరీలు, పార్కింగ్, భద్రత, నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పార్టీ కేడర్‌తో సీఎం సమావేశం జరిగే ప్రాంగణాన్ని కూడా పరిశీలించి భద్రతపై సబ్‌కలెక్టర్ హెచ్.ఎస్.భావన, ఏఎస్పీ విభూకృష్ణకు సూచనలు చేశారు. సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ మంతెన సత్యనారాయణరాజు, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి, భూపేష్‌రెడ్డి తదితరులు ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు.

వైద్య సేవకు అనూష ఆదర్శం

సేవకు రాష్ట్రస్థాయి గుర్తింపు





మంగళగిరి ఇందిరానగర్ యూపీహెచ్ సీవైద్యాధికారి డాక్టర్ అనూష పరుచూరి వైద్యసేవల్లో ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు. రోగులకు ఓపికగా వైద్యం అందించడం, ఆస్పత్రి పరిసరాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వడం ఆమె సేవల్లో ప్రత్యేకతగా నిలిచాయి. గాంధీ జయంతి సందర్భంగా విజయవాడ ఎ.కన్వెన్షన్ సెంటర్ లో నిర్వహించిన 'స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్స్ -2026'లో రాష్ట్రస్థాయి ఉత్తమ స్వచ్ఛ ఆస్పత్రి పురస్కారాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆమెకు అందించారు.దీంతో డాక్టర్ అనూషకు వ్యక్తిగతంగా గుర్తింపు రావడంతో పాటు మంగళగిరికి రాష్ట్రస్థాయిలో గౌరవం దక్కింది. 1993 మార్చి 3న గుంటూరులో జన్మించిన ఆమె ఏలూరులో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. విద్యార్థి దశలో 2,790 మందితో నిర్వహించిన రొమ్ము క్యాన్సర్ స్వయం పరీక్ష కార్యక్రమంలో పాల్గొని గిన్నిస్ రికార్డులో భాగమయ్యారు.

పేదల వైద్యానికి ఓపికే బలం

2022 మార్చిలో ఇందిరానగర్ హెల్త్ సెంటర్ లో ప్రభుత్వ వైద్యురాలిగా బాధ్యతలు చేపట్టినప్పుడు రోజుకు పది మందికి మించని రోగులు వచ్చేవారు.అంకితభావం,ఆప్యాయత,ఓపికతో సేవలు అందించడంతో ప్రస్తుతం రోగుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఆమె నాయకత్వంలో 2023లో కేంద్ర ప్రభుత్వ ఎన్ క్యూఏఎస్ గుర్తింపు లభించింది. 2024లో రాష్ట్రస్థాయి నాణ్యతా ప్రమాణాల అవార్డు, ఉత్తమ మెడికల్ ఆఫీసర్ పురస్కారం, ఈ ఏడాది ఉత్తమ డాక్టర్ ప్రశంసా పత్రం అందుకున్నారు.రోటరీ ఐకానిక్ డాక్టర్ అవార్డు,రాష్ట్ర క్వాలిటీ అస్యూరెన్స్ అవార్డు, నన్నపనేని లక్ష్మి స్మారక పురస్కారం కూడా ఆమె ఖాతాలో ఉన్నాయి.చేనేత కార్మికులు, వివిధ వృత్తుల నిరుపేదలు ఎక్కువగా వచ్చే ఈ కేంద్రంలో ప్రతి ప్రశ్నకు ఓపికగా సమాధానం చెప్పడం అనూష ప్రత్యేకత.తాజా స్వచ్ఛ ఆంధ్ర పురస్కారంతో ఆమెకు పట్టణ ప్రముఖులు, ప్రజలు అభినందనలు తెలిపారు.

జల్‌జీవన్ సభకు జనం కదలాలి



ప్రొద్దుటూరు, అక్టోబర్ 3: జమ్మలమడుగు బైపాస్ వద్ద సోమవారం నిర్వహించనున్న జల్‌జీవన్ మిషన్, పల్లె పండుగ-3.0 కార్యక్రమాలను ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే మల్లెల లింగారెడ్డి పిలుపునిచ్చారు. వైఎంఆర్ కాలనీలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో పాటు పలువురు మంత్రులు కార్యక్రమానికి హాజరుకానున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి సంబంధించిన కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం కీలకమని, పార్టీ శ్రేణులు కూడా సమన్వయంతో పనిచేసి సభను విజయవంతం చేయాలని కోరారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజలు, పార్టీ కార్యకర్తలు, నాయకులు భారీగా తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.సమావేశంలో టీడీపీ నాయకులు టప్పా మహబూబ్‌బాషా, ఆవుల రాజేశ్వర రెడ్డి, రామసంజీవరెడ్డి, ద్వారశ్ల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి నవరాత్రులకు ఘన ఆహ్వానం



దసరా పర్వదినాలను పురస్కరించుకుని ప్రొద్దుటూరులో నిర్వహించనున్న శ్రీ కన్యకాపరమేశ్వరి దేవి శరన్నవరాత్రి మహోత్సవాలకు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డిని ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు ఆహ్వానించారు. శుక్రవారం ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన సంఘం నాయకులు ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. నవరాత్రి వేడుకల్లో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించాలని కోరారు. దసరా సందర్భంగా ఆలయంలో ప్రత్యేక అలంకరణలు, పూజా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఏటా భక్తిశ్రద్ధలతో జరిగే ఈ ఉత్సవాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉందని, ఈసారి కూడా భక్తుల భాగస్వామ్యంతో మరింత వైభవంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నామని సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బుశెట్టి రామమోహన్ రావు, ఉపాధ్యక్షుడు జొన్నలగడ్డ రవి, కార్యదర్శి మురికి నాగేశ్వరరావుతో పాటు సంఘ ప్రతినిధులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

విజయవాడ ఉత్సవానికి భారీ ఏర్పాట్లు



దసరా వేడుకలు, విజయవాడ ఉత్సవ్‌ను మరింత ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉత్సవానికి హాజరుకానున్నారని, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. గత ఏడాది 3 వేల మంది కళాకారులతో నిర్వహించిన కార్నివాల్ ఈసారి 5 వేల మంది కళాకారులతో మరింత వైభవంగా సాగనుంది. పున్నమి ఘాట్, ఎంబీకే స్టేడియం, సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సరస్సు మేళా, డ్రోన్ ప్రదర్శనలు, బాణసంచా, లేజర్ షోలు ఆకట్టుకోనున్నాయి. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో యువతకు పోటీలు నిర్వహించనున్నారు. లక్షలాది మంది పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నామని, విజయవాడ ఉత్సవ్‌ను విజయవంతం చేయాలని పట్టాభిరామ్ ప్రజలను కోరారు. తాజాగా నిర్వహించిన, స్వచ్ఛధాన్‌కు 22 రాష్ట్రాల నుంచి 10 వేల మందికిపైగా పాల్గొనడంతో విశేష స్పందన లభించిందని... ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందనలు తెలిపారని పేర్కొన్నారు.

పారిశుధ్యానికి ముప్పారం పంచాయతీ ప్రాధాన్యం





